దగ్గరకు వచ్చి కోర్టు గొడవలా, అమ్మవారి దగ్గరకు వచ్చి జ్ఞానం అడగాలి కాని కోర్టు గొడవలా అన్నాడు. ఉద్యోగం పోతుందేమో అనే గొడవ ఆయనకు లేదు. అక్కడ ఉన్నవారు వీడి ఉద్యోగం తీసేయండి, ఆరు నెలలు జైలులో వేయండి అన్నారు. అప్పుడు రాణి రాసమణి ఏమని చెప్పారు అంటే ఆయన మహాభక్తుడు, ఆయనను ఉద్యోగంలో నుండి తియ్యవద్దు. నేను అమ్మవారిని ధ్యానం చేయటంలేదు, నా కోరికలను ధ్యానం చేస్తున్నాను, నేను చేసింది తప్పు, ఇంక ఆయనను ఉద్యోగంలో నుండి తీసేస్తే మహాతప్పు అవుతుంది అని చెప్పి రామకృష్ణపరమహంసగారి భక్తికి సంతోషించి అక్కడ నుండి వెళ్ళిపోయింది. రాణిగారు చాలా మంచిది అభిమానం లేకుండా సహనంగా వెళ్ళిపోయింది. ఏమీలేనివాడు అణిగి ఉండటం వేరు, రాణిగారికి అధికారం ఉన్నా అణిగి ఉండేవారు అందుచేత రామకృష్ణపరమహంస గారికి ఆవిడ మీద ప్రీతి. రామకృష్ణుడు ఎక్కువగా ఆవిడ వినయం గురించి మాట్లాడేవారు, ఆవిడ శరీరం పోయిన ఆవిడ నామం ఆయన నోట్లో నలిగింది. ఇంక ఆవిడకు మోక్షం రాకుండా ఎలా ఉంటుంది. సత్పురుషులను మనం స్మరించుకోవటం కాదు వారు ఒక్కసారి మనలను స్మరించుకొంటే చాలు మనకు మోక్షం వస్తుంది. సజ్జన సాంగత్యం యొక్క వైభవం అది. భక్తులకు నామమే సొమ్ము. మనం ఇంటి దగ్గర పైసాలు లేకపోతే దరిద్రులం అని అనుకోకూడదు. భగవంతుడి నామమే మనకు ఐశ్వర్యం, ఆయనే జ్ఞానదాత, మోక్షదాత. మనకు భక్తి లేకపోతే, భగవంతుడి పట్ల గౌరవం లేకపోతే, ఆయన నామాన్ని నోటినిండా పలకలేకపోతే దరిద్రులం. ఉద్ధవుడు కృష్ణ భక్తుడు. నాకు అది కావాలి, నాకు ఇది కావాలి అని ఉద్ధవుడు ఎప్పడూ అడగలేదు. నాకు జ్ఞానం కావాలి అని అడిగేవాడు. అందుకు భగవంతుడు ఎప్పడూ ఆయనను విడిచిపెట్టలేదు. కాని ఎప్పడైనా నేను భక్తుడను అనే అహంకారం ఉద్ధవుడికి వచ్చేది. వీడికంటే గోపికల భక్తి గొప్పది. ఉద్ధవా! నేను గోపికలను చూసి చాలాకాలం అయింది, కృష్ణుడు మిమ్మల్ని చూసి రమ్మన్నాడు అని నాకోసం నీవు వెళ్ళి చూసిరా అని కృష్ణుడు చెప్పాడు. ఉద్ధవుడు వెళ్ళి గోపికలను చూసాక వారి భక్తి ముందు నా భక్తి ఎందుకు పనికిరాదని తలవంచుకున్నాడు. ఆ భక్తిని నేర్పటానికే పరమాత్మ ఉద్ధవుడిని గోపికల దగ్గరకు పంపాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-02-2008, తాడినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవాన్ అందరినీ నిన్ను నీవు తెలుసుకో అంటున్నారు, మరి మేము ఎందుకు తెలుసుకోవాలి అని ఒక హేతువాది నన్ను అడిగారు. మీరు ఏమైనా డబ్బు సంపాదించుకొన్నారా అని నేను అడిగాను. సంపాదించుకొన్నాను అని చెప్పాడు. మీరు పెళ్ళి చేసుకొన్నారా అని అడిగితే చేసుకొన్నాను అని చెప్పాడు. ఏమైనా గౌరవం సంపాదించుకొన్నారా అని అడిగాను.

ఎక్కువలేదుగాని సరిపడగౌరవం సంపాదించుకొన్నాను అని చెప్పాడు. ఇవి అన్నీ ఎందుకు చేస్తున్నారు అని అడిగితే ఆయన మౌనంగా కూర్చొన్నారు. మనిషి అధికారం సంపాదించుకొన్నా, డబ్బు సంపాదించుకొన్నా, పెళ్ళి చేసుకొన్నా ఇవన్నీ దేనికంటే సుఖంకోసం, ఆనందంకోసం ఇవి అన్నీ చేస్తున్నాడు. అహంకారం ఉన్నవాడు తనపేరు పదిమందికి తెలియాలి అనుకొంటాడు, అది అహంకారం యొక్క స్వభావం. తేలు ఎందుకు కుడుతుంది, పాము ఎందుకు కరుస్తుంది అంటే అది వాటి యొక్క స్వభావం. అహంకారం ఉన్నవాడు ప్రతీవాడు అహంకారరహితంగా ఏపనీ చేయలేడు, అహంకార రహితంగా పనిచేస్తే వాడికి జ్ఞానమే వస్తుంది. నువ్వు డబ్బు ఎందుకు సంపాదిస్తున్నావో, పెళ్ళి ఎందుకు చేసుకొంటున్నావో, లక్షలు ఖర్చుపెట్టి అధికారం ఎందుకు సంపాదించుకొంటున్నావో అందుకోసమే నిన్ను నీవు తెలుసుకో అంటున్నారు. డబ్బు, అధికారం, పెళ్ళి ఇవి అన్నీ సుఖంకోసం, సంతోషంకోసం సంపాదించుకొంటున్నావు. కాని డబ్బు వలన, అధికారం వలన వచ్చే సంతోషం క్షణికం. నిన్ను నీవు తెలుసుకొంటే శాశ్వతమైన సుఖం, శాశ్వతమైన ఆనందం కలుగుతుంది. జీవితంలో ప్రతీదీ క్షణికం. అధికారం, డబ్బు, గౌరవం ఇవన్నీ ఎక్కడకు పోవు అనుకొంటాము కాని ఇవి అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి. ఇవన్నీ కృత్రిమంగా తెచ్చిపెట్టుకున్నవి, ఇవన్నీ స్వప్నసమానము. నేను ఎవడను అనే ప్రశ్న అందరికీ రాదు. అనేక జన్మల నుండి మంచి బుద్ధి సంపాదించుకొన్నవారికి, మంచి సంస్కారం సంపాదించుకొన్నవారికి, మంచి పనులు చేసిన వారికి నేను ఎవడను అని తెలుసు కోవాలనే బుద్ధి కలుగుతుంది కాని అందరికీ ఆ బుద్ధి కలుగదు, మొట్టికాయలు మొట్టినా కలుగదు. నాలో ఒక నేను ఉంది, ఆ నేను నాకు తెలియకుండా నాకు సుఖం లేదు, శాంతి లేదు.

పూజలు, జపాలు గొడవ తరువాత చూద్దాము, ముందు సబ్జక్టు బాగా అర్థం చేసుకోండి. మీరు దేనికైనా బెంగ పెట్టుకొన్నారు అనుకోండి, నా మాటలు వింటున్నారు అనుకోండి, రెండు రోజులు శాంతిగా, చల్లగా ఉంటుంది కాని సత్యం మీకు తెలియదు. సత్యాన్వేషకుడికి మాత్రమే సత్యం తెలుస్తుంది. రాత్రి ఆచార్యులవారు నాకు స్వప్నదర్శనం ఇచ్చారు. బాలుడు, జంధ్యం వేసుకొన్నాడు, తెల్లబట్టలు వేసుకొన్నాడు, అనుగ్రహస్వరూపంగా ఉన్నారు, ఆయన మాట్లాడలేదు. స్వప్న దర్శనం ఇవ్వటం వలన పొంగుతున్న సముద్రం, ఒక్కసారి ఆగిపోతే ఎలా ఉంటుందో అలాగ నా మనస్సు ఆగిపోయింది. జాగ్రదవస్థలోనికి వచ్చాక కూడా నా మనస్సు ఆగిపోయింది. మనం ఏదైనా మంచి పని చేసి మర్చిపోయినా అది మనలను విడిచిపెట్టదు. ఎక్కడైనా మంచి మాట విని మర్చిపోయినా సమయం వచ్చినప్పుడు గుర్తుకువస్తుంది, మనం ప్రమాదంలో పడకుండా ఆ మాట మనలను కాపాడుతుంది. అందుచేత మంచి మాటలు విని ఉండటం మంచిది. ఒకవేళ మనం ఆచరించలేకపోయినా సడన్‌గా ప్రమాదం వచ్చినప్పుడు అది మనకు ఉపయోగపడుతుంది. మనిషి అయ్యాక ఎప్పుడైనా కోపం వస్తుంది. అయితే ఆ కోపం వలన

నువ్వు పాడైపోకూడదు. మన కోపం నీటిమీద గీతలా ఉండాలికాని నువ్వు వల్లకాటికి వెళ్ళే వరకు ఆ కోపాన్ని కాపాడుకోకూడదు. నీకు కోపం రాకూడదు అని నేను చెప్పినా ఎంతోకొంత కోపం రాకుండా నువ్వు ఉండలేవు, మనస్సు ఉన్నంతకాలం అది సహజం. ఎదుటివారి మీద దయ ఉండవచ్చు. అది ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండాలి కాని దయపేరు చెప్పి రోజూ నీ మనస్సును బయటకు తోలుకొనిపోతూ ఉంటే లోపల సున్న అయిపోతావు. నీ మనస్సుకు అంతర్దృష్టి కలుగదు, మనస్సుకు లోచూపు కలుగకుండా లోపల ఉన్న బ్రహ్మపదార్థం నీకు తెలియదు. నీకు బ్రహ్మపదార్థం తెలియనప్పుడు మంచిని చెడ్డ అనుకొంటావు, మాయను జ్ఞానం అనుకొంటావు. నీకు మంచిగుణాలు ఉన్నాయి అని అక్కడికి సరిపెట్టుకొని జీవిస్తూ ఉంటే ఒక గోతిలో నుండి లేవటం ఇంకో గోతిలో పడటం, చనిపోవటం తిరిగి పుట్టటం ఈ ప్రయాణాలలో ఉంటావు. నువ్వు మంచిపనులు చేస్తే అందరూ మెచ్చుకొంటారు, ఊరేగింపులు ఉంటాయి అది నీ జీవిత ధ్యేయం కాదు, నువ్వు సత్యానుభవం పొందాలి, అదే జీవితగమ్యం, నువ్వు ఏదైనా పనిచేస్తే అహంకారరహితంగా చేయాలి. అహంకారరహితంగా పనిచేస్తూ ఉంటే అది సత్యాన్వేషణకు ఉపయోగపడుతుంది. అహంకారంతో పనిచేస్తే నీకు పుణ్యం రావచ్చుకాని అది అనుభవిస్తే వంతెనకింద నీరులాగ వెళ్ళిపోతుంది.

ప్రతీమనిషికి సుఖం కావాలి, శాంతి కావాలి, అది మన స్వరూపంలోనే ఉంది. మనమే ఆనందం, మనమే శాంతి, అది తెలియకపోవటం వలన సుఖంకోసం, శాంతికోసం బజారులో వెతుక్కొంటున్నాము. మనస్సుకు బాహ్యముఖానికి వెళ్ళిపోవటం అలవాటు. ఏదో వస్తువులో సుఖం ఉందని దానికోసం వెతుకుతుంది. అది సంపాదించాక అక్కడ సుఖం లేదని తెలుస్తుంది. నువ్వు ఎవడో నీకు తెలిసే వరకు శాశ్వతమైన సుఖం, శాంతి నీకు తెలియదు. నీకు నిరంతరం సుఖం, శాంతి కావాలంటే నీవు ఏమతస్థుడైనా నువ్వు ఎవరో నీవు తెలుసుకొని తీరాలి, ఇది రమణమహర్షి బోధ. మనందరం రోజూ నిద్రను చూస్తున్నాము. నిద్రలో ఎవడు ఉన్నాడో, ఇప్పుడు జాగ్రదవస్థలో ఎవడు ఉన్నాడో, స్వప్నంలో వాడే ఉన్నాడు. ఈ మూడు పోయినప్పుడు కూడా వాడే ఉంటాడు. నిద్రలో మనకు తెలియకపోయినా సుఖంగా ఉన్నాము. మెలుకువ వచ్చేసరికి సుఖంపోతోంది, శాంతి పోతోంది. మీ పొలము, డబ్బు, గౌరవం, దేవతలు, పుణ్యపాపాలు ఇవి ఏమీ నిద్రలో జ్ఞాపకం రావటం లేదు. వీటి గొడవ ఏమీ లేకుండా నిద్రలో మీకు సుఖం, శాంతి ఎక్కడ నుండి వస్తోంది? ఆనందం, శాంతి మీ లోపల నుండే వస్తోంది. మెలుకువ వచ్చేసరికి సడన్‌గా పొంగువచ్చినట్లు అశాంతి, దుఃఖం వచ్చేస్తుంది. మెలుకువ వచ్చేసరికి నీకు గౌరవం, డబ్బు, అధికారం ఇవి అన్నీ ఉన్నాయి. అన్నీ ఉన్నా అశాంతి ఎందుకు వస్తోంది? నిద్రలో ఇవి ఏమీ లేనప్పుడు ఎందుకు శాంతిగా ఉన్నావు? మెలుకువ రాగానే మన కుటుంబ సభ్యులమీద, బంధువులమీద, ఆస్తుల మీద మమకారం వచ్చేస్తుంది, ఇవి నాది అనేబుద్ధి

వచ్చేస్తుంది. కొంతమంది ఎదుటివారు కష్టాలు పడుతూఉంటే వీరు ఆనందిస్తారు, సంతోషంగా చెప్పకొంటూ ఉంటారు, దానిని పైశాచిక ఆనందం అంటారు, వారు మనుషులు కాదు, మానవరూపంలో ఉన్న పిశాచులు. గాఢనిద్రలో అహంకారం, మమకారం లేకుండా ఎలా ఉంటున్నావో అలా జాగ్రదవస్థలో నువ్వు ఉండగలిగితే గాఢనిద్రలో తెలియక అనుభవించిన ఆనందం, ఇప్పుడు తెలిసి అనుభవిస్తావు. అది నీ కడసారి జన్మ. ఆ ఆనందం నీకు దొరికినప్పడు ఆనందంకోసం, శాంతికోసం బజారులో వెతకవు. ఆత్మజ్ఞానం కోసం ఎవడైతే సాధన చేస్తున్నాడో వాడికి అది లభ్యమౌతుంది, సాధన లేకుండా సాధ్యము కాదు.

భగవాన్ కొండ దిగి వస్తూ ఉంటే వెనకాల ఒక భక్తుడు వస్తున్నాడు. భగవాన్ నెమ్మదిగా నడుస్తున్నారు, మనం తప్పించుకొని వెళితే బాగుండదని ఆయన కూడా నెమ్మదిగా నడుస్తున్నారు. భగవాన్ అన్నారు మీ నాన్నగారు అప్పడప్పడు కనిపిస్తున్నారు. నువ్వు దుబారా ఖర్చులు చేస్తున్నావని, అప్పలు కూడా చేస్తావని మీ నాన్నగారు చెప్పారు నీకు కలిగిఉంటే ఏదైనా ఒక రూపాయి ఇతరులకు పెట్టుకోవచ్చు అంతేగాని అప్పలుచేసి పాడైపోకూడదు అని భగవాన్ చెప్పారు. నిప్ప, అప్ప, విషం, ఈ మూడింటి విషయంలో జాగ్రత్తగా ఉండు అని చెప్పారు. పొయ్యిలో నిప్పలు తీసి గడ్డి ఉన్నచోట పడేస్తే ఒక్క నిప్పరవ్వ ఉన్నా గడ్డి అంతా అంటుకుపోతుంది, అంతేకాదు ఇల్లు కూడా అంటుకుపోతుంది. నిప్ప పూర్తిగా ఆరిపోవాలి, అందుచేత నిప్ప విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. నిప్ప అంతా ఆర్పివేసినా ఒక్క రవ్వ మిగిలి ఉంటే కొంపలంటుకు పోతాయి. నీకు లక్ష రూపాయలు అప్ప ఉంది అనుకో నువ్వు 90 వేలు తీర్చేసి, ఇంక పదివేలు మర్చిపోయావు అనుకో, అది మరల లక్ష రూపాయలు అయిపోతుంది. అందుచేత అప్ప విషయంలో జాగ్రత్తగా ఉండాలి. విషం విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. తినే ఆహారంలో విషం కొంత కలిసింది అనుకో వాంతులు, మోషన్స్ పట్టుకొంటాయి. విషం ఎక్కువ ఉంటే చనిపోతారు, అందువలన జాగ్రత్తగా ఉండాలి. నేను భగవాన్ మాట్లాడుకొన్నాము, భగవాన్‌తో నాకు పరిచయం ఉందని చెప్పటానికి ఈ మాటలు రాయటం లేదు. ఈ మూడు ముక్కలు మీరు కూడా నేర్చుకొంటే మీకు ఉపయోగపడతాయని వ్రాస్తున్నాను అన్నాడు ఆ భక్తుడు. మనం శాస్త్రాన్ని చదివేటప్పడు ఇష్టాయిష్టాలు పెట్టుకోకూడదు. మాకు నచ్చిన శ్లోకాలే చదువుతాము, నచ్చనివి చదవము అని అనుకోకూడదు. ఇష్టాలు, అయిష్టాలు పెట్టుకొంటే శాస్త్రాన్ని చదివినా అది మీకు అర్థంకాదు. కర్త ఈశ్వరుడు, బలం ఈశ్వరుడిది, మన అహంకారానికి బలం లేదు. ఈశ్వరుడి యొక్క ప్రణాళికను బట్టి ఈ సృష్టి అంతా నడుస్తోంది. ఒకోసారి మీరు కష్టపడి పని చేసినా ఫలితం రాదు, ఒకోసారి కష్టపడకపోయినా ఫలితం వచ్చేస్తుంది. అప్పడు ఎందుకు వచ్చిందో, ఇప్పడు ఎందుకు రాలేదో మనకు తెలియదు. అందుచేత మనం బెంగలు వదిలేయాలి, అంతా ఈశ్వరుడే చూసుకొంటాడు.

మనం మంచి చేసాము అనుకోండి, చేసి మర్చిపోవాలి. అలాగ మర్చిపోము అనుకోండి మనస్సు పెరిగిపోతుంది. మర్చిపోతే మనం చేసిన మంచి తాలుక ఫలం ఎప్పడు, ఎక్కడ, ఏ జన్మలో అనుసంధానం చేయాలో ఈశ్వరుడు చూసుకొంటాడు. భగవంతుడి స్వరూపం మోక్షం. భగవంతుడిని తెలుసుకోకుండా ఆయన స్వరూపమైన మోక్షం మనకు అందదు. నువ్వు మాట్లాడేమాట, చేసేపని, నీకు వచ్చే ఆలోచనలు అన్నీ మోక్షం పొందటానికి సహకరించేలా ఉండాలి. ఈ రకంగా జీవిస్తూ ఉంటే ఈ జన్మలోనే మోక్షం రాకపోయినా రాబోయే జన్మలో మోక్షం పొందటానికి తగిన పరిస్థితులు ఉన్న కుటుంబంలో జన్మింపచేస్తాడు. మనస్సు బయటకు పోవటానికి ప్రియం, అప్రియంలే కారణం. సాధ్యమైనంత వరకు ఈ ప్రియం, అప్రియంలు లేకుండా చూసుకొంటే మనస్సు అంతర్ముఖమవుతుంది. నీ హృదయంలో ఉన్న నిజమైన నేనుకు ఈ అబద్ధమైన నేను ప్రతిబింబము అన్నారు ఆచార్యులవారు. అద్దంలో మన మొఖం చూసుకొంటే మన మొఖం యొక్క ప్రతిబింబం కనిపిస్తుంది. అద్దం పగిలిపోతే ఆ ప్రతిబింబం ఏమౌతుంది? ఆ ప్రతిబింబం నీ మొఖంలో కలిసిపోతుంది. అలాగే నీ మనస్సు అనే తెర తెగిపోతే ఈ అబద్ధమైన నేను వెళ్ళి నిజమైన నేనులో కలిసిపోతుంది. భక్తి యోగం, కర్మయోగం, ధ్యానయోగం అని యోగాలు చాలా ఉన్నాయి. నీవు అహంకారాన్ని త్యాగం చేసావు అనుకో ఆ త్యాగానికి మించిన యోగం ఏదైనా ఉందా ఈ లోకంలో అన్నారు ఆచార్యులవారు. ఈ పూజ చేసుకోండి ఈ కోరిక నెరవేరుతుంది అని ఎవరైనా చెపితే మీకు ఇష్టంగా ఉంటుంది కాని ఆత్మజ్ఞాన సముపార్జనకోసం ఎవరూ ప్రయత్నం చేయటం లేదు కారణం దాని విలువ మనకు తెలియటంలేదు. మనకు చిత్తశుద్ధిలేదు అందుచేత నేను ఎవడను అనే విచారణ మనకు రావటం లేదు. ఏది పొందితే నిత్యంగా, సత్యంగా ఉంటుందో దాని తాలుక ఎరుక మనకులేదు.

వాడు పూర్వజన్మలో చేసిన పుణ్యపాపములను బట్టి పుణ్యం అదృష్టం కింద, పాపం దురదృష్టం కింద వస్తుంది. పుణ్యం అనుభవించేటప్పడు సంతోషం కలుగుతుంది, పాపం అనుభవించేటప్పడు వాడికి దుఃఖం కలుగుతుంది. ఆ సంతోషంగాని, ఆ దుఃఖంగాని వాడికి అంటకుండా చూసుకొంటే వాడు సాధకుడు అవుతాడు అన్నారు ఆచార్యులవారు. సర్వసాధారణంగా అసూయ వలన విమర్శలు చేస్తారు. అసూయల వలననే విమర్శలు చేస్తున్నామని వారికి తెలియదు. అసూయ మాటలు చెప్పేవారికి ఎంత దోషమో వినేవారికి కూడా అంతే దోషము. అక్కడికి ఎవరో స్వామి వస్తే వెళ్ళామండి, ఆయన భగవంతుడు లేడని చెపుతున్నారు అని భగవాన్‌తో అంటే వారు అలా చెప్పటం పొరపాటుకాదు, అక్కడకు మీరు వెళ్ళటం పొరపాటు. మీలో ఏదో బలహీనత ఉంది లేకపోతే మీరు అక్కడకు ఎందుకు చేరతారు. ఏగూటి పక్షులు ఆ గూటికి వెళతాయి. సాధకుడి లక్షణం ఏమిటి అంటే బయట గొడవలు బయటే వదిలేయాలి. రోడ్డు మీద దుమ్ము అంతా పోగుచేసి మీ ఇంట్లో పోసుకొంటారా?

మిమ్మల్ని ఎవరైనా పొగిడినా, ఎవరైనా విమర్శించినా అది లోపలకు తీసుకోకూడదు, దానిని లోపలకు తీసుకొంటే మీ లోపల విషం ప్రవేశిస్తుంది, మీరు చేసిన సాధన అంతా పాడైపోతుంది. మన శరీరానికి గాయం తగిలితే హాస్పటల్‌కు వెళ్ళి గాయం బాగుచేయించుకోవచ్చునుగాని మనస్సు పాడైపోతే హాస్పటల్‌లో బాగుచేయరు. ఎంతో సాధన చేస్తేగాని, గురువు అనుగ్రహం ఉంటేగాని, కాలం కలిసివస్తేగాని మనస్సుకు పడ్డగాయం తగ్గదు. నువ్వు పూజ చేస్తున్నావు, జపం చేస్తున్నావు, ధ్యానం చేస్తున్నావు కాని లక్ష్యం మోక్షం మీద ఉందా? సీత రూపంలో రాముడు ఉన్నాడు, రాముడి రూపంలో సీత ఉంది అన్నాడు వాల్మీకి అంటే ఇద్దరూ వేరుకాదు అని చెప్పటంకోసం అలా చెప్పాడు. పార్వతీ పరమేశ్వరులు వేరుకాదు, ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే.

బుద్ధిమంతుడికి మనం చిన్న ఉపకారం చేస్తే జీవితం పొడుగునా మనలను జ్ఞాపకం పెట్టుకొంటాడు. దుష్టులకు ఎన్ని ఉపకారాలు చేసినా అప్పటికప్పుడు మర్చిపోతారు. జరిగేది అంతా ఈశ్వరసంకల్పంతో జరుగుతుంది, దానితో నువ్వు రాజీపడలేనప్పుడు దుఃఖం వస్తుంది. జరిగేది జరగక మానదు, రానున్నది రాక మానదు. మీకు వచ్చే అదృష్టం ఉంటే ఎవరూ చెడగొట్టలేరు, వచ్చేస్తుంది అది ఈశ్వరాజ్ఞ. శక్తి ఈశ్వరుడిది. అటువంటి ఈశ్వరుడిని పూజించి, స్మరించి మీరు తరించండి. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని నీకు భక్తి కుదిరితే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వచ్చేస్తాయి. మీకు భౌతికమైన భోగాలు, భౌతికమైన భాగ్యాలు ఇవన్నీ వస్తే రావచ్చుగాని ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలోనికి రాకుండా ఆత్మజ్ఞానం కలుగదు. మన హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, దాని గురించి శ్రవణం చేయాలి, మననం చేయాలి, దాని గురించి సమాచారం సేకరించాలి, అది ఆత్మ విద్య. జపధ్యానముల వలన ఏ ఫలితం వస్తుందో, గురువు వాక్యాన్ని అర్థం చేసుకోవటం వలన ఆ ఫలితం వస్తుంది. మీరు చదివిన వాక్యం, మీరు శ్రవణం చేసిన మాటలు మీ గుండెకు తాకాలి, మీ లోపల ఒక భాగం అవ్వాలి అని ఆచార్యులవారు చెప్పారు. అభ్యాస వైరాగ్యములు లేకుండా, తపస్సు లేకుండా ఇంద్రియాలు కాని, మనస్సుకాని అణగవు. అవి అణిగితేనేగాని లోపల ఉన్న ఈశ్వరుడు మనకు స్వరూపంగా వ్యక్తంకాడు. ఏకాంతవాసం, మౌనం ఈ రెండూ మనోనిగ్రహానికి సహకరిస్తాయి. మనం ఇంటి దగ్గర ఎక్కువ మాట్లాడకూడదు. అవసరమైనప్పుడు మాట్లాడాలి. ఇంటి దగ్గర ఒకటి, రెండు గంటలు నోరు కట్టుకోవటం మంచిది. ఎక్కువ మాట్లాడేవారికి సమాజంలో గౌరవం ఉండదు. మనకు మాట అణగదు అనుకోండి, ఇంద్రియాలు అణగవు అనుకోండి, మనస్సు అణగదు అనుకోండి ఆత్మజ్ఞానం ఎరుకలోనికి రాదు. మనకు బలమైన వాసన ఉంది అనుకోండి, అది ఒక్కటే నిజం అనిపిస్తుంది. ఆ వాసనలో నుండి బయటకు రావటానికి భగవంతుడిని ప్రార్థించటం, దానికి వ్యతిరేకమైనవి మనం ప్రాక్టీసు చేస్తే నెమ్మదిగా అది పల్చబడిపోతుంది. ఆ బలహీనతలు ఒకప్పుడు మంచివి అని నేర్చుకొన్నాము, ఇప్పుడు చెడ్డవని మనకు అర్థమవుతోంది.

వాటిని విడిచిపెట్టేటప్పుడు కష్టమవుతోంది.

మనం నోటితో తినే ఆహారం శుభ్రంగా ఉందో లేదో చూసుకొంటాము. చెవులతో వినే విషయాల పట్ల జాగ్రత్త పడము, కళ్లతోచూసే విషయాలపట్ల మనం జాగ్రత్త పడము. నోటితో తీసుకొనే ఆహారం కంటే చెవులతో, కళ్లతో తీసుకొనే ఆహారం పట్ల ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. అదీ ఆహారమే అని తెలియకపోవటం వలన అజాగ్రత్తగా ఉంటున్నాము. నేను తినేది మాత్రమే కాదు, నేను వినేది చూసేది కూడా శుచిగా ఉండేటట్లు నన్ను అనుగ్రహించు అని ఒక వేదంలో ప్రార్థించాడు. మనం ముందు ప్రపంచాన్ని పెడుతున్నాము. తరువాత ఖాళీగా ఉన్నప్పుడు భగవంతుడిని స్మరించుకోవచ్చు అనుకొంటున్నాము. భగవంతుడిని స్మరించటంవలన పవిత్రులం అవుతాము అన్న సంగతి తెలియక స్మరణలో అశ్రద్ధ చేస్తున్నాము. గోపికలది కోరికలేని భక్తి, కోరికలేని ప్రేమ, కోరికలేని ఆప్యాయత. మనకు సమాజం అంటే ఎంతోకొంత భయం ఉంటుంది. పరమాత్మకోసం సామాజిక గౌరవం, కుటుంబ గౌరవం కూడా వదిలిపెట్టి పరమాత్మ వెనకాల పరుగెట్టారు, వారు గోపికలు. పూర్వపుణ్యం ఉంటేనేగాని, గురువు అనుగ్రహం ఉంటే గాని ఈశ్వరుడిపట్ల అంత ప్రేమకలగటం సాధ్యంకాదు. నువ్వు ఏ పని చేసినా ఈశ్వరార్పణగా చేస్తున్నావు అనుకో మోక్షం దగ్గరకు నీవు వెళ్లనక్కరలేదు, మోక్షమే నీ దగ్గరకు వస్తుంది. మనకు ఎల్లయ్య ఎల్లయ్యలాగ, పుల్లయ్య పుల్లయ్యలాగ కనిపిస్తున్నారు మరి రాధ అందరిలోను కృష్ణుడినే చూస్తోంది కదా అంటే కృష్ణుడు అనే కాటుకను కళ్లకు రాసుకొని చూస్తోంది అందుచేత అంతా కృష్ణమయమే. భగవంతుడిపట్ల ఆపుకోలేని ప్రేమ కలుగుతూ ఉంటే, ఆ ప్రేమప్రవాహంలో అహంకారం కొట్టుకొనిపోతుంది. మీరు లోపల ఉన్నారు అనుకొంటున్నారు కదా. మీరు లోపల ఆత్మగా ఉన్నారా, వ్యక్తిగా ఉన్నారా? మీరు వ్యక్తిగానే ఉన్నారు, ఆ వ్యక్తిగా ఉండటమే అహంకారం. అది పడిపోకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు.

సూర్యుడు ఉదయిస్తేగాని చీకటి పోదు అలాగే జ్ఞానసూర్యుడు ఉదయిస్తేగాని అజ్ఞానం బయటకు పోదు. నీకు ఒకోసారి సంతోషం వస్తుంది, ఒకోసారి దుఃఖం వస్తుంది, ఒకోసారి లాభం, ఒకోసారి నష్టం వస్తుంది, ఈ హెచ్చుతగ్గులు అన్నీ నీకే, ఇవన్నీ మేఘాలు. ఈ మేఘాలు ఉన్నంతకాలం జ్ఞానసూర్యుడు నీకు కనబడడు. మనకు నిద్రలో అహంకారం లేదు. పది గంటలు నిద్రపోతే పది క్షణాల కింద వెళ్లిపోతుంది. పగలు పదిక్షణాలు పది గంటల కింద వెళుతుంది, కారణం అహంకారంలో టైము ఉంది, అహంకారం ఎక్కడైతే లేదో అక్కడ టైము లేదు. భగవంతుడు నీకు తెలిసినా తెలియకపోయినా అసలు మన హృదయంలో భగవంతుడు అనేవాడు అంతర్యామిగా ఉన్నాడని కనీసం నమ్మకం లేకపోతే ఆయన ఎందుకు తెలియబడతాడు. నేను మీకు ఈ మాటలు చెప్పటం వలన భగవదనుభవం వచ్చేయదు. కాని ఇలా పదిసార్లు మీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు అని చెప్పటం వలన ఉన్నాడని అనుకోవటం వలన

మీకు విశ్వాసం కలుగుతుంది, ఆ విశ్వాసం మీకు భగవదనుభవం కలగటానికి సహకరిస్తుంది, అందుకు రిపీటెడ్‌గా చెప్పటం. కాలమనే సర్పము మనలను కాటువేయక ముందే మనం జ్ఞానం సంపాదించాలి. అలా జ్ఞానం సంపాదించ లేదు అనుకోండి ఏ లోకంలోనికి వెళ్ళిపోతామో, ఏ కుటుంబంలోనికి వెళ్ళిపోతామో, మనకు ఎటువంటి జన్మ వస్తుందో మనకు తెలియదు.

ఒకే స్త్రీని ఒకడు భార్య అంటాడు, ఒకడు అమ్మ అంటాడు, ఒకడు మేనత్త అంటాడు, ఒకడు పిన్నమ్మ అంటాడు. ఆ స్త్రీని ఎవడి కోణంలో నుండి వాడు చూసి అలా అంటున్నారు. ఇంతకూ ఆ స్త్రీ అమ్మా, భార్యా, మేనత్తా లేక పిన్నమ్మా అని భగవాన్ అడుగుతున్నారు. ఇటువంటివి చెప్పేటప్పుడు భగవాన్ నిర్మోహమాటంగా మాట్లాడతారు. మనకు మోహం తగ్గటానికి సబ్జక్టు మనకు ఎదురుగుండా పెట్టేస్తారు. ఇంట్లోవారి కోసం రూపాయికి 90 పైసలు ఖర్చుపెడుతూ ఉంటే, నువ్వు మోహం లేకుండా, ఏమీ ఆశించకుండా పని పనికోసమే 10 పైసలు ఖర్చు పెట్టలేవా అంటున్నారు. రూపాయికి రూపాయి నీ ఇంట్లో వారే తినేయాలా? వారి వల్ల నీకు ఏమైనా వస్తుందా? ఏమీ రాదు. భగవంతుడి ప్రీత్యర్థం ఏదైనా పనిచేస్తే అది భగవంతుడి ఎక్కౌంట్ లోనికి వెళుతుంది, అది మరణానంతరం నీకు ఉపయోగపడుతుంది. ఇక్కడ ఎక్కౌంటులో ఉన్న డబ్బు మరణానంతరం నీకు చెల్లదు. నువ్వు ఎవరికైనా ఉపకారం చేసినా, అపకారం చేసినా ఇది అంతా నా వల్లే అవుతోంది అనుకొని చేయటం వలన నీకు పుణ్యపాపాలు అంటుతున్నాయి. నేను కర్తను కాదు, ఈశ్వరుడే కర్త అని నోటితో చెప్పటంకాదు, లోపల ఆ భావనాబలం ఉంటే నీకు పుణ్యపాపములు అంటవు. ఒక్క ఆత్మ జ్ఞాని తప్పించి, నేను కర్తను కాదు అని ఎవడూ పనిచేయలేడు. నీవు జీవుడై చేస్తే పుణ్యం ఉంది, పాపం ఉంది. నీవు దేవుడై చేస్తే పుణ్యం లేదు, పాపం లేదు, ఒకవేళ వెనకాల ఏదైనా ఉంటే అదికూడా రాలిపోతుంది, నీవు ప్రత్యేకం విడిచిపెట్టనక్కరలేదు. 105 డిగ్రీల జ్వరంతో ఉన్నప్పుడు వాడి నోటిలో పాయసం పోసినా అది చేదుగా ఉంటుంది. అలాగే మనం అజ్ఞానం అనే జ్వరంతో కాలిపోతున్నప్పుడు, మమకారం అనే జ్వరంతో కాలిపోతున్నప్పుడు భగవంతుడు చెప్పిన మాటల యొక్క విలువ మనకు తెలియదు. చిత్తశుద్ధి లేకపోతే ఈశ్వరుడి పట్ల మనకు ప్రేమరాదు, అసలు మనకు జిజ్ఞాస కలుగదు. మనం ఒక పనిని క్రమంగా చేస్తే అది ఫలిస్తుంది, క్రమం విడిచిపెట్టేస్తే అది ఫలించదు, నువ్వు చాలా విషయాల గురించి చెప్పావు మరి మేము తరించే మాటలు చెప్పవా అని ధర్మరాజు భీష్ముడిని అడిగితే అప్పుడు విష్ణుసహస్రనామాలు చెప్పి ఇది పారాయణ చేసుకోండి. మీరు తరిస్తారు అని చెప్పాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| మార్చి | 6 | చించినాడ, శివరాత్రి |
| మార్చి | 9 | గుండుగొలను |
| మార్చి | 11 | లక్కవరం, సరస్వతి శిశుమందిర్ మ॥ 3-00లకు |
| మార్చి 14 నుండి 26 వరకు అరుణాచలం క్యాంపు | | |
| మార్చి | 31 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| ఏప్రియల్ | 6 | ఖండవల్లి |

# పుస్తక సమీక్ష

శ్రీ యం. శివరామకృష్ణ గారిచే తెలుగునుండి ఆంగ్లమునకు అనువదింపబడి, సద్గురువు శ్రీ నాన్నగారి ప్రవచనాల సారమైన "అమృతవాక్కులు - మనస్సును శాంతింపజేసే సాధన" అను పుస్తకముపై శ్రీ బాలసుబ్రహ్మణియన్ గారిచే 'తత్త్వలోక' ఫిబ్రవరి 2008 మాసపత్రికలో ప్రచురించ బడిన ఆంగ్ల సమీక్షకు ఆంధ్రానువాదము.

పైన పేర్కొనబడిన పుస్తకము శ్రీ నాన్నగారి ప్రవచనాల సారమైన అమృతవాహిని పుస్తకము నకు ఆంగ్లానువాదము. ఆంధ్రప్రదేశ్‌లో ఒక సంపన్న కుటుంబములో జన్మించిన శ్రీ నాన్నగారు స్వప్నములో భగవాన్ శ్రీ రమణమహర్షిచే ఆశీర్వదించబడి, అప్పటినుండి భగవాన్ శ్రీరమణమహర్షి భక్తునిగా అనేకసార్లు అరుణాచలమును సందర్శించారు. ఒక సందర్భములో అరుణాచలంలో శ్రీ నాన్నగారి "మనస్సు హృదయంలో లయించి తన ఉనికిని కోల్పోవుట జరిగినది".

అనేక ప్రాంతాలలో, అనేక సందర్భాలలో భక్తులకు ప్రవచనాల ద్వారా బోధింపబడిన సందేశాన్ని అంశముల వారీగా సమీకరించుట జరిగినది, అట్టివాటిలో 'సాధన-రహస్యములు' ఒక అంశము. అత్యంత సరళము, శక్తివంతము అయిన శ్రీ నాన్నగారి ప్రవచనాలు పాండిత్య సంబంధమైనవి కాక, అంతరానుభూతి నుండి జాలువారినవే! అతిసామాన్యమైన ఉదాహరణలతో సరళమైన భాషలో స్పష్టముగా పొందుపరచబడిన బోధసూటిగా అంతిమసత్యంలోకి మేల్కొలిపేదిగా ఉంది. ఈ పుస్తకములోని ప్రవచనాల సారం ఆధ్యాత్మిక సాధకులకు అత్యంత ఉపయోగకరముగా ఉన్నవి. సాధనలో ముఖ్య ఆటంకము 'చంచల మనస్సు'. అనేకజన్మల నుండి ప్రోగుచేసుకున్న సంస్కారములచే బహిర్ముఖమైన అట్టి మనస్సును ఏకచింతనకు అలవాటు చేసి, తద్వారా నశింపజెయ్యడం క్లిష్టమైన సాధనే అయినప్పటికీ, నిరంతర అభ్యాస, వైరాగ్యములచేత మనస్సును అతిక్రమించవచ్చునని శోకతప్తుడైన అర్జునుడికి శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో బోధించాడు. క్లిష్టమైన యోగ సాధనల కన్న పరమాత్మ పట్ల సజీవ విశ్వాసము, నిర్మల భక్తి, ప్రేమతో జ్ఞానప్రాప్తి కలుగుతుంది. భగవాన్ శ్రీరమణమహర్షి, శ్రీ రామకృష్ణపరమహంసల బోధలు ఆచరణకు అనువుగా సులభమైన రీతిలో పొందుపరచబడినవి. ఆధ్యాత్మికమార్గములో సాధకులకు అనేక సందర్భాలలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారములు స్పష్టముగా సూచించబడిన ఈ పుస్తకము అత్యంత విలువైనది.

అనువాదం : **చావలి సూర్యనారాయణమూర్తి**, టీచర్, అమలాపురం

# వేరుచేసేది అహంభావన - ఐక్యం చేసేది ఆత్మభావన

చైతన్యాన్ని పరిమితం చేసే అంశాలు సంస్కారాలు, వాటితో నిర్మితమైన పరిమితి కట్టడమే అహంకారం. తాను దేహమనే అసత్య భావన మూలంగా అహంకారం భ్రాంతికి ఆధారమౌతుంది. ఇతర జీవులు తనకన్న వేరు అని భావిస్తుంది. దీని నాశనం సత్యానుభవంతో పరిసమాప్తమౌతుంది. నిత్య జీవితంలో మన కుటుంబ సభ్యులను మనం ఎలా ప్రేమిస్తామో అలాగే సత్యాన్ని తల్లిగాను, జ్ఞానాన్ని తండ్రిగాను, ధర్మాన్ని సోదరుడిగాను, దయను గురువుగాను, శాంతిని మిత్రునిగాను, క్షమను సోదరిలాగా ప్రేమించాలి. అలా జీవించకపోతే మనకు ఇష్టంకాని వ్యక్తి, పరిస్థితులుగాని ఎదురైనప్పడు. మనలో ఉండే క్రోధ సంస్కారం సహజంగా వేరుభావనతో మనం క్రోధానికి గురియై ఊగిపోతాము. ఆత్మజ్ఞానంలో ఉన్నప్పడు మన కోపం ఎదుటివానిపై కాక మన సంస్కారాలపైనే దృష్టిపడి వాటిపైనే కోపపడితే అవి రహితమైపోతాయి. అంతా నేనే అందరూ నేనే అనే భావం వల్ల తత్‌సంబంధమైన వారు అంతా ప్రయోజనం పొందుతారు. ఇన్నాళ్ళు మనం అహంభావననే సత్యమని భావించి దుఃఖానికి బలి అయ్యాము, ఇప్పడు శాశ్వతమైన ఆత్మ నేను అనే ఆలోచన నాటుకొంటే పరమానందం అందుతుంది. జ్ఞాని ఈ ఐక్య భావనతో ఎటుచూచినా తానే అని పరమానందంతో ఉంటాడు. మనకు రవ్వంత స్వార్థం ఉంటే చాలు ఇతరుల వాసనలను అనుసరించటానికి సిద్ధం చేస్తుంది. అజ్ఞానం మనిషిని నడుపుతుంది. భయం మనిషిని పాడుచేస్తుంది. గత తప్పిదాలను తలచుకొని వర్తమాన భవిష్యత్తులను పాడుచేసుకొంటున్నాము. శ్రద్ధ వల్ల భవిష్యత్తు బంగారమౌతుంది. కబీర్ "తెలివిగలవాడు ఈ ప్రపంచాన్ని సృష్టించాడు అందులో నీవు భాగమే దాన్ని ఆయన రక్షించుకోగలడు అనే విశ్వాసం నీకు ఉండాలి గురువు ఎవరిని మేలుకొలుపునో వాడు బాగుపడతాడు. సద్గురువు నీకు అన్ని ఇస్తాడు అతనికి నీవు ఏమీ ఇయ్యవలసినవి లేదు" అన్నారు. ఈ అహంభావన తన పుట్టినిల్లు అయిన ఆత్మలో ఉండక మెట్టినిల్లు అయిన శిరస్సులో ఉంటూ నిలకడలేక అన్ని జాతులతో కలుస్తూ అమంగళంగా కలకాలం జీవిస్తుంది. శ్రీ నాన్నగారు "అహంభావన పనసపొట్టు నరికినట్లు దేశమని, కాలమని, నీవని, నేను అని నరుక్కుపోతుంది ఐక్యతలో ఉన్న ఆనందం దానికి తెలియదు" అన్నారు. కాబట్టి కల్పవృక్షమైన ఆత్మ నీడలో జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు,** అర్థవరం